
క్లుప్తంగా

బెల్టు షాపులకు వ్యతిరేకంగా పంచాయతీ తీర్మానం

సామర్లకోట: మండలంలోని పీబీ దేవం గ్రామంలో మద్యం బెల్టు షాపులు ఏర్పాటు చేయకుండా చూడాలని పంచాయతీ తీర్మానం చేసింది. సర్పంచ్ నీలపాల సత్యనారాయణ అధ్యక్షతన బుధవారం జరిగిన పంచాయతీ సాధారణ సమావేశంలో ఈ తీర్మానం చేసినట్టు పంచాయతీ కార్యదర్శి వై శ్రీహరి తెలిపారు. బెల్టు షాపులు లేకుండా చూడాలని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు పంచాయతీ కార్యదర్శి గురువారం లేఖ రాశారు. గ్రామంలో ప్రభుత్వ లైసెన్స్‌డ్ మద్యం దుకాణం లేనందున, గ్రామంలో ఎక్కడా బెల్టు షాపుల ద్వారా మద్యం విక్రయించకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని 60వ అంశంగా తీర్మానం చేశారు. దాంతో బెల్టు షాపుల నిర్వాహకులకు ఏమి చేయాలో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. పంచాయతీ సమావేశం జరుగుతున్న సమయంలో వంద మంది వరకు బెల్టు షాపు ఏర్పాటుకు మద్దతుగా వచ్చారనే విమర్శలున్నాయి.

వైభవంగా జ్యోతిర్లింగార్చన



సామర్లకోట పంచారామ క్షేత్రంలో జ్యోతిర్లింగార్చన

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో గురువారం రాత్రి ఏర్పాటు చేసిన జ్యోతిర్లింగార్చన భక్తులను ఆకట్టుకుంది. కార్తిక మాసం సందర్భంగా రూ.2,500 చెల్లించి లక్ష పత్రి పూజలు చేసుకున్న వారికి ఆలయ దీపారాధన సంఘ సభ్యులు జ్యోతిర్లింగార్చన ఏర్పాటు చేశారు. లక్షపత్రి పూజలు చేసిన వారు దీపాలను వెలిగించగా, మిగిలిన వాటిని ఆలయానికి వచ్చిన భక్తులు వెలిగించారు. గురువారం సామర్లకోటకు చెందిన మురళీకృష్ణ కుటుంబ సభ్యులు, మధు కుటుంబ సభ్యులు లక్షపత్రి పూజలు చేయించుకున్నట్లు ఈఓ భళ్ల నీలకంఠం తెలిపారు. ఘనాపాటి శ్రీపాద రాజశేఖర శర్మ ఆధ్వర్యంలో లక్షపత్రి పూజలు జరిగాయి.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్



ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ

సామర్లకోట: ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త సీవీ రామన్ జయంతిని పురస్కరించుకుని స్థానిక వివేకానంద పబ్లిక్ స్కూల్‌లో గురువారం సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ ఎగ్జిబిషన్‌ను ఎంఈఓ వై శివరామకృష్ణయ్య సందర్శించి, విద్యార్థులను అభినందించారు.

రీ సర్వే గ్రామసభలను వినియోగించుకోండి

కొత్తపల్లి: మండలంలోని కుతుకుడుమిల్లి గ్రామ సచివాలయం వద్ద గురువారం తాహసీల్దార్ చిన్నారావు ఆధ్వర్యంలో రీ సర్వే రెవెన్యూ గ్రామసభను నిర్వహించారు. వివిధ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. సభకు 18 దరఖాస్తులు అందినట్లు తహసీల్దార్ తెలిపారు. శుక్రవారం వాకతిప్ప, 12న కొత్తపల్లి, 13న ఉప్పాడ, 14న సుబ్బంపేట, 16న గోర్సలో గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి విద్యార్థుల ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందిస్తున్న విద్యార్థులు

కొత్తపల్లి: మండలంలోని ఉప్పాడకు చెందిన బొందు అనూష గత కొంత కాలంగా కిడ్నీ సమస్యతో అనారోగ్యానికి గురై బాధ పడుతున్నాడు. స్థానిక వీవీఎస్ పాఠశాల విద్యార్థులు గురువారం బాధితుడికి రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. ఆర్థిక సాయం చేసిన విద్యార్థులను కరస్పాండెంట్ కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

పంచాయతీ కార్యదర్శులకు నేడు శిక్షణ

సామర్లకోట: మండలంలోని గ్రేడ్ 1 నుంచి గ్రేడ్ 5 వరకున్న పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్లకు ఒక రోజు శిక్షణ ఉంటుందని ఎంపీడీఓ కె ఉమామహేశ్వరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ సమావేశ హాల్‌లో నైపుణ్య గణన సర్వేపై శిక్షణ ఉంటుందన్నారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లు ఈ శిక్షణకు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

గ్యాస్ కబుర్లు



సామర్లకోట కంటి ఆస్పత్రి వద్ద ఏర్పాటు చేసిన భాగ్యనగర్ గ్యాస్ ఫీడర్ బాక్స్



గ్యాస్ పైపులైన్ ఏర్పాటుతో ధ్వంసమైన సత్యనారాయణపురం రోడ్డు

- ఇంటింటా గ్యాస్ సరఫరా ఒట్టిమాటేనా!
- పైపులైన్ వేసి ఏళ్లు గడుస్తున్నా అమలు కాని పథకం
- రోడ్ల తవ్వకంతో వెక్కిరిస్తున్న గోతులు

సామర్లకోట: ప్రతి ఇంటికి గ్యాస్‌ను పైపులైన్ ద్వారా అందజేయాలని గతంలో ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గ్యాస్ కంపెనీకి చెందిన ప్రతినిధులు మున్సిపాలిటీ పరిధిలోని రోడ్ల మీదుగా పైపులైన్లు ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా ఆర్అండ్‌బీ రోడ్లు, మున్సిపల్ రోడ్లను తవ్వేశారు. దాంతో రోడ్లపై గోతులే మిగిలాయి మినహా, గ్యాస్ మాత్రం అందలేదని ప్రజలు పెదవి విరుస్తున్నారు.

ఫీడర్ బాక్సుల ఏర్పాటు

తాగునీరు పైపులైన్ మాదిరిగా ప్రతి ఇంటికి పైపు లైన్ ద్వారా గ్యాస్ అందజేస్తామని సుమారు పదేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఈ పథకానికి శ్రీకారం చుట్టారు. ప్రతి ఐదు కిలోమీటర్లకు ఒక ప్రదేశంలో భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో గ్యాస్ ఫీడర్ బాక్స్‌లను ఏర్పాటు చేశారు. దీని ద్వారా పైపులైన్లలో గ్యాస్ ఏ పరిమాణంలో వస్తుందో తెలుసుకోవడానికి వీలవుతుంది. ఈ ఫీడర్ బ్యాక్సులు ఏర్పాటు చేసి ఏళ్లు గడుస్తున్నా ఎటువంటి ప్రయోజనం లేదని ఆయా ప్రాంతాల వారు వాపోతున్నా రు.

ముమ్మర ప్రచారం

పైపులైన్ ద్వారా గ్యాస్ అందించే క్రమంలో ప్రతి ఇంటికి మీటర్లు ఏర్పాటు చేయాలి. ఆయా మీటర్ల రీడింగ్ ప్రకారం గ్యాస్ బిల్లు వస్తుందనే ప్రచారం ముమ్మరంగా జరిగింది. అయితే గ్యాస్ పైపులైన్లకు చెందిన ఫీడర్ బాక్స్ పట్టణ పరిధిలో ఇళ్లకు సమీపంలో ఫ్లై ఓవర్ బ్రిడ్జికి చేర్చి ఏర్పాటు చేయడంతో, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఫ్లై ఓవర్ బ్రిడ్జి నుంచి రాత్రి సమయాల్లో వాహనాలు అదుపు తప్పి కిందకు దూసుకుపోయిన సంఘటనలు అనేకం ఉండడంతో.. ఆ ప్రాంత ప్రజల్లో గుబులు పుట్టిస్తోంది.

బ్రిడ్జి గోడకు చేర్చి..

ఫ్లై ఓవర్ బ్రిడ్జి రెయిలింగ్‌ను వాహనాలు ఢీ కొనడంతో బ్రిడ్జిపై నాలుగు ప్రదేశాల్లో రక్షణ గోడలు కూలిపోయాయి. ఆ రెయిలింగ్‌లు ఇప్పటికీ మరమ్మతులకు నోచుకోలేదు. ఫ్లై ఓవర్ బ్రిడ్జి గోడకు చేర్చి ఫీడర్ ఉండటంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. ఫీడర్ బాక్స్‌ల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి చేతులు దులుపుకొంటున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. హెచ్చరిక బోర్డుపై ఉన్న ఫోన్ నంబర్లకు ఫోన్ చేసినా.. సరైన సమాధానం ఉండటం లేదని స్థానికులు వాపోతున్నారు.

పదేళ్లు గడిచినా..

గ్యాస్ పైపు లైన్‌తో పాటు, ఫీడర్ ఏర్పాటు చేసి సుమరు పదేళ్లు గడుస్తున్నా ఇంటింటా గ్యాస్ మాత్రం కార్యరూపం దాల్చలేదు. కాకినాడ కార్పొరేషన్ పరిధిలో ఇంటింటా గ్యాస్ ఇస్తున్నట్టు భాగ్యనగర్ గ్యాస్ ప్రతినిధులు చెబుతున్నారు. ప్రారంభంలో ఇచ్చిన కనెక్షన్లు మినహా కొత్తవి ఇవ్వడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. పైపులైన్ల ద్వారా ఇంటింటికీ గ్యాస్ సరఫరా చేస్తే వంటగ్యాస్ ఏజెన్సీల ఆధారం పోతుందనే కారణంగానే ఇంటింటా గ్యాస్ ఇవ్వడంలో జాప్యం జరుగుతుందనే ఆరోపణలు లేకపోలేదు. ఏదిఏమైనా రోడ్లను ధ్వంసం చేస్తూ, గ్యాస్ పైపులైన్లు వేయడంతో.. ఆయా ప్రాంతాలకు కచ్చితంగా పైపులైన్ల ద్వారా గ్యాస్ ఇవ్వాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

అధికారులు చొరవ చూపాలి



ఇంటింటికీ పైపులైన్ ద్వారా గ్యాస్ సరఫరా కావడానికి అధికారులు చొరవ చూపాలి. గ్యాస్ పైపులైన్ కోసం మున్సిపాలిటీ పరిధిలో అనేక ప్రాంతాల్లోని రోడ్లను ధ్వంసం చేశారు. దీనిని దృష్టిలో ఉంచుకుని, రోడ్లు పాడైన ప్రాంతాలకు ప్రాధాన్యమిస్తూ గ్యాస్ అందజేయాలి. పైపులైన్ ద్వారా గ్యాస్ అందడం వలన సిలిండర్ల కోసం వేచి ఉండాల్సిన పనుండదు. ఖర్చు కూడా తగ్గుతుంది.

– పాగా సురేష్‌కుమార్, కౌన్సిలర్, సామర్లకోట

ఇంటింటా గ్యాస్‌పై చర్చిస్తాం



మున్సిపాలిటీ పరిధిలో అన్ని ప్రాంతాలకు పైపులైన్లు ఏర్పాటు కాలేదు. పైపులైను ఏర్పాటు చేయడానికి అనేక ప్రాంతాల్లో రోడ్లను కట్టింగ్ చేయాల్సి వస్తుంది. దానికి ఎక్కువగా నష్ట పరిహారం చెల్లించాల్సి వస్తుందని భాగ్యనగర్ గ్యాస్ ప్రతినిధులు భావిస్తున్నట్టు తెలిసింది. ఈ మేరకు వారితో మాట్లాడి, పైపులైన్ ఏర్పాటు చేసిన ప్రాంతాలకు ఇంటింటా గ్యాస్ ఇచ్చే ఏర్పాట్లు చేయాలని కోరుతాం. ముందుగా పైపులైన్ గ్యాస్ సరఫరాపై అవగాహన పెరగాలి.

–ఎ శ్రీవిద్య, మున్సిపల్ కమిషనర్, సామర్లకోట

నేరాల అదుపునకు సహకరించాలి

వ్యాపారులతో డీఎస్పీ శ్రీహరిరాజు



సీఐ, ఎస్సైలకు సూచనలు ఇస్తున్న డీఎస్పీ శ్రీహరిరాజు

సామర్లకోట: సమాజంలో నేరాలను అదుపు చేయడంతో పాటు, నేరస్తులను గుర్తించడానికి వ్యాపారులు సహకరించాలని పెద్దాపురం డీఎస్పీ కె శ్రీహరిరాజు కోరారు. గురువారం స్థానిక స్టేషన్ సెంటర్‌లోని షాపులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి షాపు యజమాని సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దీని కారణంగా తమ షాపులకు భద్రత ఏర్పడటంతో పాటు, ఇతర ప్రాంతాల్లో నేరాలు జరిగిన సమయంలో నేరస్తులను గుర్తించడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. ముఖ్యంగా రైల్వే స్టేషన్‌లోను, బస్సు కాంప్లెక్స్‌లోను అధికారులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. మరమ్మతులకు గురైన కెమెరాలను పని చేసేలా చూడాలని సూచించారు. పట్టణ ముఖ్యకూడలి ప్రదేశం కావడంతో నేరాలు చేసి తప్పించుకోవడానికి రైల్వే స్టేషన్, ఏడీబీ రోడ్డు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి వ్యాపారి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని పోలీసులకు సహకరించాలన్నారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్, బస్సు కాంప్లెక్స్‌లను డీఎస్పీ పరిశీలించారు. బస్సు కాంప్లెక్స్‌లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఆయన వెంట సీఐ ఎ.కృష్ణభగవాన్, ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు, ఇతర సిబ్బంది ఉన్నారు.

పంచారామ క్షేత్రంలో భక్తుల రద్దీ



పంచారామ క్షేత్రంలో స్వామివారికి చేస్తున్న తొలి అభిషేకం



ప్రత్యేక అలంకరణలో కుమారారామ భీమేశ్వరస్వామి

సామర్లకోట: పవిత్రమైన పంచారామ క్షేత్రంలోని బాలాత్రిపుర సుందరి సమేత చాళుక్య కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో గురువారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కార్తికమాసాన్ని పురస్కరించుకుని తెల్లవారుజామున తొలి అభిషేకం, తొలి పూజలు తిలకించడానికి భక్తులు బారులు తీరారు. భక్తులు తెచ్చిన పాలతో ఒకసారి మాత్రమే స్వామివారికి క్షీరాభిషేకం చేస్తారు. అనంతరం నీటితో అభిషేకం చేస్తున్నారు. కార్తిక సోమవారాలు, కార్తిక పౌర్ణమి, స్వామివారి జన్మనక్షత్రం రోజున మాత్రమే పంచామృతాలతో అభిషేకాలు చేయడానికి కేంద్ర పురావస్తు శాఖ అనుమతి ఇచ్చింది. ఆలయానికి వచ్చిన భక్తులకు ఉదయం పులిహోర ప్రసాదం, మధ్యాహ్నం అన్న ప్రసాదాన్ని ఏర్పాటు చేశారు. ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అల్లకి రాజగోపాల్‌శర్మ, చెరుకూరి రాంబాబు, సన్నిధిరాజు వెంకన్నలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో నెల రోజుల పాటు ఘనాపాటి శ్రీపాద రాజశేఖరశర్మ ఆధ్వర్యంలో లక్షపత్రి పూజలు నిర్వహిస్తున్నారు. సాయంత్రం స్వామివారిని, అమ్మ వారిని ప్రత్యేక అలంకరణలు చేశారు.

మహిళాభివృద్ధికి బ్యాంకర్లు సహకరించాలి

మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీవిద్య

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలోని మహిళా సంఘాల అభివృద్ధికి బ్యాంకర్లు సహకరించాలని మున్సిపల్ కమిసనర్ ఎ శ్రీవిద్య అన్నారు. గురువారం సాయంత్రం మున్సిపల్ కమిషనర్ చాంబర్‌లో ఏర్పాటు చేసిన బ్యాంకర్ల సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. మహిళా సంఘాలలో ఉన్న సభ్యులు జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం చేసుకోవడానికి ముందుకు వచ్చిన సమయంలో వారికి అదనపు రుణాలు ఇవ్వాలని కమిషనర్ సూచించారు. అదే విధంగా మున్సిపాలిటీ పరిధిలో కొత్తగా సంఘాలు ఏర్పాటు చేసుకున్న వారికి బ్యాంకు ఖాతాలు తెరచి, రుణాలు అందజేయాలన్నారు. వీధి వ్యాపారులకు పావలా వడ్డీ రుణాలకు సంబంధించి వారికి బ్యాంకు ఖాతాలు తెరవాలన్నారు. రూ.10 వేలు, రూ.20 వేలు తీసుకున్న తోపుడు బండ్ల వ్యాపారులకు రూ.50 వేల రుణం అందజేసి, వారి వ్యాపారాభివృద్ధికి సహకరించాలని కోరారు. వివిధ కుల వృత్తులకు చెందిన వారు బ్యాంకు రుణాల కోసం చేసిన దరఖాస్తులను పరిశీలించి కలెక్టర్‌కు పంపామన్నారు. కలెక్టర్ నుంచి ఆయా బ్యాంకులకు వచ్చిన దరఖాస్తుల ఆధారంగా కుల వృత్తిదారులకు రుణాలు ఇవ్వాలని తెలిపారు. రూ.లక్షకు తగ్గకుండా, రూ.రెండు లక్షల వరకు రుణం ఇవ్వాలన్నారు. టిడ్కో లబ్ధిదారులకు ఇచ్చిన రుణాల రికవరీపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి మెప్మా సీటీ మిషన్ మేనేజరు బి ప్రసాద్, వివిధ బ్యాంకుల మేనేజర్లు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

వేణుగోపాలుని వార్షిక కల్యాణ వేడుకలకు ఏర్పాట్లు



వేడుకలకు సిద్ధమైన వేణుగోపాలుని ఆలయం



రుక్మిణీ, సత్యభామ సమేత స్వామివారు

పిఠాపురం: పిఠాపురం పట్టణంలో స్వయంభూ క్షేత్రంగా విరాజిల్లుతున్న రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయ వార్షిక దివ్య కల్యాణ వేడుకలు ఈ నెల 11 నుంచి 18 వరకు జరుగుతాయని అర్చకులు విజయ జనార్ధనాచార్యులు, కార్యనిర్వాహణా ధికారి నున్న శ్రీరాములు తెలిపారు. యాజ్ఞిక బ్రహ్మ సుదర్శనం మాధవ మణికంఠా చార్యులు ఆధ్వర్యంలో జరిగే ఈ వేడుకల్లో 11న ఉదయం స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకం, 12న ఉదయం ఆలయం వద్ద వేణుగోపాల స్వామి ఆలయ అభివృద్ధి సేవా సమితి మహిళా భక్త సమాజం వారిచే స్వామివారి కల్యాణ అలంకరణ అనంతరం గజ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే రోజు రాత్రి 8 గంటలకు కల్యాణం, 13న ఉదయం శేష వాహనంపై గ్రామోత్సవం, 14న రాత్రి 7 గంటలకు రథోత్సవం, 15న ఉదయం ఆలయం వద్ద చక్రస్నానం, గరుఢ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు. 16 నుంచి 18 వరకు ప్రతి రోజు రాత్రి 8 గంటలకు ఆలయం వద్ద స్వామివారి పుష్పయాగం జరుగుతుందని తెలిపారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కార్యనిర్వాహణాధికారి నున్న శ్రీరాములు, ఆలయ అభివృద్ధి సేవా సమితి ప్రెసిడెంట్ చెరుకుపల్లి శ్రీనివాసు, సభ్యులు తెలిపారు.

హెల్మెట్ పెట్టు.. గిఫ్ట్ కొట్టు!

రహదారి ప్రమాదాల నివారణకు పోలీసుల వినూత్న ప్రచారం



హెల్మెట్ ధరించిన వాహన దారుడికి బహుమతి అందజేస్తున్న గొల్లప్రోలు ఎస్సై నౌడు రామకృష్ణ

పిఠాపురం: రోడ్డు ప్రమాదాల నివారణకు గొల్లప్రోలు పోలీసులు వినూత్న ప్రచారం ప్రారంభించారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ప్రచారం చేస్తూ హెల్మెట్ ధరించిన వారికి బహుమతులు సైతం అందజేస్తున్నారు. గురువారం గొల్లప్రోలు ఎస్సై నౌడు రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు 216 జాతీయ రహదారిపై వాహనదారులకు హెల్మెట్ ప్రాముఖ్యతను వివరిస్తూ చేసిన వినూత్న ప్రచారం చూపరులను ఆకట్టుకుంది. పలువురిని ఆలోచింపజేసింది.

15 నుంచి సీపీఎం జిల్లా మహాసభలు

పెద్దాపురం: సీపీఎం కాకినాడ జిల్లా మహాసభలు ఈ నెల 15 నుంచి 17 వరకు జరుగుతాయని పార్టీ నాయకుడు నీలపూల సూరిబాబు తెలిపారు. ఈ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ గురువారం పట్టణంలో ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ఈ సభల్లో భవిష్యత్తు పోరాటాలకు రూపకల్పన చేస్తారన్నారు. పార్టీ మండల కన్వీనర్ డి.క్రాంతికుమార్, సిరిపురపు శ్రీనివాస్, నెక్కల నరసింహమూర్తి, బంగార్రాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

104 సిబ్బంది ఆందోళన



పిఠాపురంలో వినతిపత్రం అందజేస్తున్న 104 సిబ్బంది



కొత్తపల్లిలో తహసీల్దార్ చిన్నారావుకు వినతిపత్రం అందిస్తున్న ఉద్యోగులు

పిఠాపురం: తమ డిమాండ్లు పరిష్కరించాలని గొల్లప్రోలు 104 సిబ్బంది గురువారం ఆందోళన నిర్వహించారు. ఈ మేరకు గొల్లప్రోలు ఎంపీడీఓ స్వప్నకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ తమకు 3 నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని, కుటుంబాలను పోషించటం కష్టతరంగా మారిందని వాపోయారు. 104 సేవలను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా నిర్వహించి ప్రజాధనం వృథా కాకుండా చూడాలన్నారు. అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పీఎఫ్ సొమ్మును తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు యాజమాన్యం నుంచి రావలసిన బకాయిలు చెల్లించే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో 104 డీఈఓ కె.సూర్యదుర్గ, డ్రైవర్ ఎం.సువర్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం మండలంలో..

న్యాయ పరమైన డిమాండ్ల పరిష్కారానికి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పిఠాపురం మండల 104 సిబ్బంది డిప్యూటీ తహసీల్దార్ రామచంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో 104 సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేట్ల రాంబాబు, పిఠాపురం మండల ఉద్యోగులు దుర్గాదేవి, రాఘవ, సంతోష్‌లు పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలి

కొత్తపల్లి: 104 ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న జీతాలను తక్షణం చెల్లించాలని సిబ్బంది గురువారం తహసీల్దార్ చిన్నారావుకు వినతి పత్రాన్ని అందించారు. అరబిందో యాజమాన్యం చెల్లించాల్సిన 3 నెలల వేతనం వెంటనే చెల్లించాలని కోరారు. వాహనాలకు ఫిట్‌నెస్ ఇన్సూరెన్స్‌లు చేయించాలని కోరారు. 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్, డీఈఓలకు జీఓ నెంబర్ 7 ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది సతీష్, ప్రసాద్, తాతాజీ, రవిబాబు పాల్గొన్నారు.

బాలికలు, మహిళలు అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

సామర్లకోట: పెరుగుతున్న నేరాల నేపథ్యంలో బాలికలు, మహిళలు అప్రమత్తంగా ఉండాలని సీఐ ఎ.కృష్ణభగవాన్ అన్నారు. స్థానిక వైఆర్ఎల్ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఇటీవల కాలంలో మహిళలపై వేధింపులు, ఆకతాయిల బెడద పెరిగాయని చెప్పారు. మహిళలు, విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని, పోలీసుల సేవలను వినియోగించుకోవాలన్నారు. తమను వేధించే ఆకతాయిల వివరాలను పోలీసులకు అందజేయాలన్నారు. ప్రతి ఒక్కరి సెల్‌ఫోన్లలో హెల్ప్‌లైన్ నంబరు, దిశ యాప్ ఉంచుకోవాలని సూచించారు. అపాయకర పరిస్థితుల్లో వాటి ద్వారా బయటపడవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ వై.రవిచంద్, ప్రిన్సిపాల్ వై.లావణ్య ఏఓ ఎ.దుర్గాప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధిపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పిఠాపురం: క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పిఠాపురం ఇందిరా నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యుడు డాక్టర్ జయరాం సూచించారు. ఆయన ఆధ్వర్యంలోని వైద్య సిబ్బంది గురువారం పిఠాపురం మున్సిపాలిటీ పరిధిలో పలు వార్డుల్లో క్యాన్సర్ వ్యాధిపై అవగాహనా ర్యాలీలు నిర్వహించారు. స్థానికులకు క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాలకు కుర్చీల వితరణ

పిఠాపురం: పిఠాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యుడు బాదం ఉదయ సూర్యప్రకాష్ కళాశాల నూతన భవనం కోసం 20 కుర్చీలను విరాళంగా అందజేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. పి.సుభాషిణి తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అల్లూరి నాగేష్, సీపీడీసీ సభ్యులు శంకరరావు పాల్గొన్నారు. దాతకు కళాశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపారు.